సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 12 । జనవరి । 2025

జనంతో రైల్వే స్టేషన్ కిటకిట..





బస్సు ఎక్కేందుకు ప్రయాణికుల పాట్లు

కిక్కిరిసిన రైళ్లు, బస్సులు

ద్వారకానగర్/తాటిచెట్లపాలెం: సంక్రాంతి పండక్కి విశాఖలో జీవనం సాగిస్తున్న ప్రజలు సొంతూళ్లకు పయనమవుతున్నారు. ఇప్పటికే స్కూళ్లు, పాఠశాలలకు సెలవులు ఇవ్వగా, రెండవ శనివారం, ఆదివారం కలిసి రావడంతో ఉద్యోగులు శనివారం తమ కుటుంబాలతో సహా పల్లె బాట పట్టారు. దీంతో విశాఖపట్నం నుంచి బయలుదేరిన రైళ్లన్నీ ప్రయాణికులతో కిటకిటలాడాయి. ప్రత్యేక రైళ్లు లేకపోవడం, ఉన్న రైళ్లలోనూ సీట్లు దొరక్కపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులతో నిండిపోయాయి. ద్వారకా బస్టేషన్ కిక్కిరిసింది. ముందుగా అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు సంతోషంగా ఉండగా, టికెట్ బుక్ చేసుకోని ప్రయాణికులు సీట్ల కోసం తీవ్రంగా ప్రయత్నించారు. దూర, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ద్వారకా బస్టేషన్‌కు పోటెత్తారు. రైళ్లలో రద్దీ కారణంగా చాలా మంది ప్రయాణికులు బస్సులను ఆశ్రయిస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ ట్రావెల్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకుని ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు టికెట్ ధరలను అమాంతంగా పెంచేశాయి.

ప్రైవేట్ బస్సుల్లో నిలువు దోపిడీ

- డిమాండ్‌కి సరిపడా బస్సు సర్వీసులు నడపని ఆర్టీసీ
- అవసరాన్ని ఆసరాగా చేసుకొని దోచుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్
- హైదరాబాద్, బెజవాడ నుంచి రావాలంటే 200 శాతం చార్జీలు అదనం
- విమానయానమూ చాలా కాస్ట్‌లీ గురూ!
- రెండున్నర రెట్లు చార్జీలు పెంచేసిన విమానయాన సంస్థలు



సంక్రాంతి వచ్చిందంటే చాలు.. పండగంతా ప్రైవేట్ ట్రావెల్స్‌దే.! సీజన్‌లో దొరికిందే తడవుగా చార్జీల పేరుతో ప్రయాణికులను నిలువునా దోచుకుంటున్నాయి. దీంతో పండగ ప్రయాణాలు సామాన్య ప్రజలకు భారంగా మారుతున్నాయి. రైళ్లలో రెండు నెలల ముందే రిజర్వేషన్లు నిండిపోవడం, ఆర్టీసీ సైతం అవసరానికి తగినన్ని బస్సులు నడపకపోవడంతో టికెట్లు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తోంది. దీన్నే అవకాశంగా తీసుకుని ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలు నిలువు దోపిడీకి పాల్పడుతున్నాయి. సాధారణ టికెట్టు ధర కంటే దాదాపు మూడు రెట్లు అధికంగా టికెట్టు ధరలను పెంచేశాయి. పెరిగిన టికెట్ ధరలతో బేజారెత్తిపోతున్న జనం కళ్లల్లో సంక్రాంతి కాంతులు కళా విహీనంగా కనిపిస్తున్నాయి. అసలే 'ప్రియ'మైన విమానయానం.. పండగ పూట మరింత కాస్ట్‌లీగా మారిపోయింది.

- సాక్షి, విశాఖపట్నం

సంక్రాంతి పండక్కి ఇంటికి రావాలనుకునే వారి జేబులకు చిల్లులు పడుతున్నాయి. పండక్కి హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు నుంచి విశాఖకు వస్తుంటారు. ముందుగా ప్లాన్ చేసుకున్నవారంతా రైళ్లకు బుకింగ్ చేసుకున్నారు. సెలవు దొరుకుతుందో లేదో అని వెయిట్ చేసి చివరి నిమిషంలో ప్రయాణానికి సిద్ధమైన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆర్టీసీ బస్సులు, రైళ్లలో ఒక్క సీటూ లేని పరిస్థితి ఉంది. పోనీ విమానంలో వద్దామనుకుంటే వాటి ధరలకు ఆకాశానికి మించి పెరిగిపోయాయి.

అరకొర బస్సులతో ఆర్టీసీ

ఆర్టీసీ సంక్రాంతి బస్సు సర్వీసులకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. ప్రధానంగా హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి జిల్లాకు వచ్చే ప్రజల నుంచి ఈ డిమాండ్ ఎక్కువగా వినబడుతోంది. సాధారణంగా హైదరాబాద్ నుంచి విశాఖకు ప్రైవేట్ ట్రావెల్స్‌లో రూ.900 నుంచి మొదలై వీకెండ్స్‌లో రూ.1800 వరకు ఉంటాయి. కానీ ప్రస్తుతం రూ.3000 నుంచి రూ.5 వేల వరకు టికెట్ల ధరలను పెంచేశారు. మరోవైపు విశాఖ నుంచి తిరిగి వెళ్లేందుకు కూడా చేతి చమురు వదిలించుకోవాల్సిందే. 19న తిరుగు ప్రయాణమయ్యేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆ సమయంలోనూ టికెట్ ధరలను 200 శాతం వరకు పెంచేశారు. ఇక ఆర్టీసీ సంక్రాంతి కోసమంటూ 9 నుంచి 13 వరకు రెగ్యులర్ సర్వీసులతో పాటు స్పెషల్ సర్వీసులు కలిపి హైదరాబాద్, రాజమండ్రి, విజయవాడ, కాకినాడకు కేవలం 80 బస్సులు మాత్రమే నడుపుతోంది. అయితే ఈ స్పెషల్ సర్వీసుల్లో టికెట్లన్నీ ఇప్పటికే హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. డిమాండ్ పుష్కలంగా ఉన్నా.. ఆర్టీసీ మాత్రం అదనపు సర్వీసులు నడపడం లేదు. డిమాండ్‌కు అనుగుణంగా మరిన్ని స్పెషల్ సర్వీసులు నడపడం ద్వారా భారీగా ఆదాయం పొందే అవకాశం ఉన్నా.. కేవలం ప్రైవేట్ ట్రావెల్స్‌కు కొమ్ము కాసేందుకు స్పెషల్ సర్వీసుల్లో కోత విధిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


రైళ్లన్నీ రిగ్రెట్!

ఇక రైలు ప్రయాణం గురించి ఆలోచన మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వే సికింద్రాబాద్ నుంచి విశాఖకు, ఇక్కడి నుంచి సికింద్రాబాద్‌కు స్పెషల్ ట్రైన్లు ప్రకటించిన కొద్ది సేపటికే రిజర్వేషన్లు ఫుల్ అయిపోయాయి. కనీసం వెయిటింగ్ లిస్ట్ కూడా దొరకడం లేదు. నిలబడి వెళ్లేందుకైనా కొందరు ప్రయాణికులు ప్రయత్నిస్తుండగా.. రైళ్లన్నీ వెయిటింగ్ లిస్ట్ పరిమితి కూడా ఫుల్ అయిపోయి రిగ్రెట్‌లోకి వెళ్లిపోయాయి.

గగనయానం అందనంత దూరం.!

ఇక చేసేది లేక ఫ్లైట్‌లో వచ్చేద్దామని కొందరు భావించినా.. ఆ వైపు చూడాలంటే భయపడేటట్టుగా టికెట్ ధరలు కనిపిస్తున్నాయి. సాధారణంగా విశాఖ నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు 4 వేల నుంచి రూ.5 వేల వరకు ఫ్లైట్ టికెట్ ఉండేది. కానీ.. ప్రస్తుతం రూ.15 వేల నుంచి రూ.18 వేల పైగా విమానయాన సంస్థలు టికెట్ల ధరలను పెంచేశాయి.

విశాఖ నుంచి విజయవాడకు టికెట్ ధరలు ఇలా



12వ తేదీ ఆదివారం.. 19వ తేదీ ఆదివారం

విశాఖ నుంచి హైదరాబాద్‌కు టికెట్ ధరలు ఇలా



13వ తేదీ సోమవారం 19వ తేదీ ఆదివారం



విమాన ఛార్జీలు ఇలా..

హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు రూ.18 వేలు

ఆఫీస్‌లో చివరి నిమిషంలో సెలవు దొరికింది. ట్రైన్ టికెట్స్ దొరకలేదు. బస్సుల పరిస్థితి దారుణంగా ఉంది. రూ.5 వేల వరకు టికెట్ ధర చెబుతున్నారు. అంత డబ్బులు పెట్టి ఎక్కినా.. పండగ ట్రాఫిక్‌లో వైజాగ్ చేరేందుకు కనీసం 16 గంటల సమయం పడుతుంది. అందుకే ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకున్నాను. పండగ ఖర్చుల కోసం దాచుకున్న డబ్బుల్లో సగం వరకూ టికెట్‌కే చెల్లించుకోవాల్సి వచ్చింది. రూ.18 వేలు పెట్టి టికెట్ కొని మరీ రావాల్సి వచ్చింది. **- జి.సోమేష్, విశాఖపట్నం**



సొంత కారులో వచ్చేశాం

హైదరాబాద్ నుంచి మా కుటుంబం మొత్తం నలుగురం పండగకు ఊరు రావాలని ప్రయత్నించాం. బస్సు, ట్రైన్, ఫ్లైట్ మొత్తం చూశాం. టికెట్ రేట్లు చూసిన తర్వాత ఊరెళ్లకపోతే మంచిదనిపించింది. పెద్ద పండగకు కచ్చితంగా సొంతూరు రావాలన్న సెంటిమెంట్ ఉంది. అందుకే మా సొంత కారులో విశాఖపట్నం చేరుకున్నాం.

- జ్యోత్స్న, విశాఖపట్నం



ట్రావెల్ బస్సులపై దాడులు

అగనంపూడి: సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేస్తున్న ట్రావెల్ బస్‌లపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝుళిపించారు. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, బెంగళూరు నుంచి వేల సంఖ్యలో ప్రయాణికులు ఉత్తరాంధ్ర జిల్లాలకు వస్తుండటంతో.. వీరి నుంచి ట్రావెల్స్ బస్సులు అదనపు డబ్బులు వసూలు చేస్తున్నాయి. దీనిపై ఫిర్యాదులు రావడంతో గాజువాక ఆర్టీవో వి.జయప్రకాష్ పర్యవేక్షణలో శనివారం ఉదయం నుంచి దాడులు నిర్వహించారు. మొత్తం 15 బస్సులపై కేసులు నమోదు చేసి, రూ.రెండు లక్షల వరకు అపరాధ రుసుం వసూలు చేశారు. సరకులు రవాణా చేస్తున్న 10 బస్సులు, అధిక టికెట్ ధర వసూలు చేసిన మూడు బస్సులు, ఓవర్ లోడ్‌తో ప్రయాణం సాగించిన రెండు బస్సులపై కేసులు నమోదు చేసినట్టు ఆర్టీవో తెలిపారు. ఈ నెల 17వ తేదీ వరకు ట్రావెల్ బస్సుల తనిఖీలు ఉంటాయన్నారు. సాధారణ ధర కంటే టికెట్ ధర పెంచి వసూలు చేసినా.. సరకులు రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



ప్రైవేట్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

న్యూస్‌రీల్

రేపు సింహగిరిపై సంక్రాంతి సంబరాలు

సింహాచలం: సింహగిరిపై సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆరోజు ఉదయం రాజగోపురం ఎదురుగా పెద్ద ఎత్తున భోగి మంటను వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గొబ్బెమ్మలతో ముత్యాల ముగ్గులు, డూడూ బసవన్నల విన్యాసాలు, జగం దేవర, కొమ్మదాసరి, హరిదాసు వేషధారణలు, కపిలగోవు, కపిలగిత్త, ఎడ్లబండి, పూరిళ్లు, కుండల ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఉదయం 9 గంటలకు చిన్న పిల్లలకు భోగిపళ్లు పోసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఆసక్తిగల తల్లిదండ్రులు తమపిల్లలను సింహగిరిపై ఉన్న నృసింహమండపంలోకి తీసుకురావాలన్నారు. అలాగే మహిళలకు ఆదివారం సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ముగ్గులు వేయాల్సి ఉంటుందన్నారు. విజేతలకు బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈనెల 15వ తేదీన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో ఉదయం 9 గంటలకు గోపూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో తెలిపారు.

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా సింహాచలం

మహారాణిపేట: పలువురు డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లిస్తూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ ఎ.సింహాచలం ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ) జోనల్ మేనేజర్‌గా నియమితులయ్యారు. విశాఖ జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉన్న జి.జయదేవిని వంశధార ప్రాజెక్టు భూసేకరణ అధికారిగా నియమించారు. అనకాపల్లి జిల్లా ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ) జోనల్ మేనేజర్‌గా ఎస్.నరసింహామూర్తి. అనకాపల్లి జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా బి.ఆశయ్య నియమితులయ్యారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం

మహారాణిపేట : రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ శనివారం రాత్రి విశాఖ చేరుకున్నారు. ఆయనకు విశాఖ విమానాశ్రయంలో కలెక్టర్ హరేంద్ర ప్రసాద్. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి నేరుగా గ్రాండ్ బే హోటల్‌కి వెళ్లారు.

విశాఖ భూములపై 'కిలాడీ' చూపు!



- డీ-పట్టా భూములను దోచుకునేందుకు పక్కాగా ప్లాన్
- భీమిలి, ఆనందపురం ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- రెవెన్యూ అధికారుల ద్వారా వివరాల సేకరణ
- ప్రధాని పర్యటన ఏర్పాట్లలోనూ హడావుడి

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

కోట్ల విలువైన విశాఖ భూములపై 'కిలాడీ' కన్ను పడింది. ఫ్రీ-హోల్డ్ భూములను చేజిక్కించుకునేందుకు చిన్న బాస్ క్లాస్‌మేట్ కిలాడీ విశాఖలో మకాం వేసినట్టు తెలుస్తోంది. ప్రధాని పర్యటన సమయంలో ఇక్కడకు వచ్చిన సదరు కిలాడీ భీమిలి, ఆనందపురంతో పాటు సబ్బవరం తదితర ప్రాంతాల్లోని విలువైన భూముల వివరాలను సేకరించినట్టు సమాచారం. అంతేకాకుండా ఇప్పటికే ప్రభుత్వ వ్యవహారాల్లో చిన్న బాస్ మిత్రుడిగా 'శానా' అతిచేస్తున్న మరో నేత కూడా కలిసి ఈ వ్యవహారాలు చక్కబెడుతున్నట్టు తెలుస్తోంది. 20 ఏళ్ల క్రితం రైతులకు కేటాయించిన డీ-పట్టా భూములను ఫ్రీ-హోల్డ్ చేస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తద్వారా వాటిని తమ అవసరాలకు వినియోగించుకునేందుకు రైతులకు అవకాశం కల్పించింది. అయితే, కొత్త ప్రభుత్వం వీటిపై గత కొద్ది నెలలుగా నిషేధం విధించింది. రానున్న మూడేళ్ల కాలంలో ఫ్రీ-హోల్డ్ కానున్న (20 ఏళ్లు పూర్తయిన) భూముల వివరాలనే సదరు కిలాడీ టీమ్ సేకరిస్తోంది. కొంతమంది రెవెన్యూ అధికారుల ద్వారా వివరాలను తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా వివాదాస్పద భూములపై కూడా వీరి కన్ను పడింది. స్థానికంగా ఉన్న రాజకీయ నాయకుల మాటకు విలువ లేకుండా ఇప్పటికే చక్రం తిప్పుతున్న సదరు కిలాడీ టీమ్.. మొత్తం భూ దందాను తమ చేతుల్లోకి తీసుకుంటున్నట్టు రెవెన్యూ వర్గాల్లోనూ చర్చనీయాంశమవుతోంది.

ఫ్రీ-హోల్డ్ భూములపై కన్ను!

వాస్తవానికి రైతుల వద్ద 20 ఏళ్ల నుంచి ఉన్న డీ-పట్టా భూములను తమ అవసరాల కోసం వినియోగించుకునేందుకు వీలుగా ఫ్రీ-హోల్డ్ చేసేందుకు గత ప్రభుత్వం అవకాశం కల్పించింది. విశాఖ జిల్లాలో సుమారు 100 ఎకరాల భూములు మాత్రమే ఫ్రీ-హోల్డ్ జరిగింది. దీనిపై ప్రతిపక్షంలో ఉన్న సమయంలో టీడీపీ నేతలు అనేక ఆరోపణలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే రెండు దఫాలుగా విచారణ జరిపించారు. ఎటువంటి అవకతవకలు జరగలేదని ఈ ప్రభుత్వం నియమించుకున్న అధికారులే తేల్చిచెప్పారు. మరోవైపు ఫ్రీ-హోల్డ్‌ను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. 20 ఏళ్లు పూర్తయిన డీ-పట్టా భూములను రిజిస్ట్రేషన్ చేయకుండా ఆదేశాలు జారీ చేసింది. మరి కొద్ది రోజుల్లో ఈ ప్రక్రియను తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈలోగా ఈ భూములను కొట్టేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగానే సదరు కిలాడీ కాస్తా విశాఖపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే 20 ఏళ్లు పూర్తయిన వాటితో పాటు రానున్న 3 ఏళ్లల్లో ఏయే భూములు ఫ్రీ-హోల్డ్ అయ్యే అవకాశం ఉందో... ఆ వివరాలను సేకరిస్తున్నారు. తద్వారా ఆయా రైతుల నుంచి వీటిని కారుచౌకగా కొట్టేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే సదరు కిలాడీ ఇక్కడే మకాం వేసినట్టు సమాచారం

ప్రధాని పర్యటన ఏర్పాట్లలోనూ..!

వాస్తవానికి ఆయనకు ప్రభుత్వంలో ఎటువంటి అధికారిక పదవి లేదు. కేవలం చిన్న బాస్ మిత్రుడని మాత్రమే అందరికీ తెలుసు. ఇప్పటికే అమరావతిలో చిన్న బాస్ ఆదేశాలతో పూర్తిస్థాయిలో అన్ని వ్యవహారాలను చక్కదిద్దుతున్న సదరు కిలాడీ.. ఇప్పుడు విశాఖలోనూ చక్రం తిప్పేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అధికారికంగా ఎటువంటి హోదా లేకపోయినప్పటికీ... ప్రధాని పర్యటన సందర్భంగా అధికారులతో కలిసి ఏయూ గ్రౌండ్స్‌లో హల్‌చల్ చేశారు. అధికారులకు ఆదేశాలు ఇస్తూ ఏర్పాట్లపై సమీక్షించారు. ఎటువంటి హోదా లేకపోయినప్పటికీ చిన్న బాస్ క్లాస్ మేట్ హోదాలో సకల వ్యవహారాలు సదరు కిలాడీనే చూసుకుంటున్నారన్న విమర్శలు ఇప్పటికే ఉన్నాయి. సాక్షాత్తూ ప్రధాని పర్యటన ఏర్పాట్ల వ్యవహారంలోనూ జిల్లా లోని అధికారులకు కూడా ఈ విషయం అర్థమైనట్టు తెలుస్తోంది. ఇదే సమయంలో సదరు కిలాడీ భీమి లి, ఆనందపురం, సబ్బవరం తదితర ప్రాంతాల్లోని ఫ్రీ-హోల్డ్ భూములపై వివరాలు సేకరించారు. ఆయా రెవెన్యూ అధికారుల ద్వారా వివరాలు తీసుకొని.. రైతుల నుంచి చౌకగా కొట్టేసి... ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత తమకు చెందేలా వ్యవహారాలు సర్దుబాటు చేసుకుంటున్నారని తెలుస్తోంది.

సంక్రాంతి అంటే రైతుల పండగ



భోగి మంట వేస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ మహిళా ప్రతినిధులు

- కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు అన్యాయం
- మాజీ మంత్రి అమర్‌నాథ్ మండిపాటు
- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

సాక్షి, విశాఖపట్నం: సంక్రాంతి అంటే రైతుల పండగ. కానీ కూటమి ప్రభుత్వం ఏడు నెలల పాలనలో రైతుకు తీవ్ర అన్యాయం జరిగిందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భోగి మంటలు, గంగిరెద్దు విన్యాసాలు, హరిదాసు సంకీర్తనలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. రంగురంగుల ముగ్గులు వేసేందుకు వైఎస్సార్ సీపీ మహిళా నేతలు పోటీపడ్డారు. ఈ సంబరాల్లో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ నుంచి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. చెరకు రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రసింగ్ డిసెంబర్ తొలి వారంలో ప్రారంభ మయ్యేదని, ఈ సీజన్‌లో జనవరి 12వ తేదీ వచ్చినా క్రసింగ్ మొదలు కాలేదన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో రోడ్లు గుంతలతో దయనీయంగా ఉన్నాయని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను డీబీటీ పద్ధతిలో అందించామని, ప్రజలంతా సంతోషంగా సంక్రాంతి జరుపుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదని అమర్‌నాథ్ అన్నారు.ఈ ఏడాది అందరికీ మంచి జరగాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, తైనాల విజయ కుమార్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవిరెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు జాన్ వెస్లీ, పేర్ల విజయచందర్, పి.సుజాత, పార్టీ ముఖ్య నాయకులు మొల్లి అప్పారావు, వుడా రవి, జహీర్ అహ్మద్, చిన్న దాస్, నడింపల్లి కృష్ణరాజు, ద్రోణంరాజు శ్రీ వాత్సవ్, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, స్వాతి దాస్, పద్మారెడ్డి, బిపిన్ కుమార్ జైన్, శశికళ, కో-ఆప్షన్ సభ్యులు బోని శివరామకృష్ణ, తుల్లి చంద్రశేఖర్, ఎండీ షరీఫ్, పీలా వెంకటలక్ష్మి, అల్లంపల్లి రాజాబాబు, మారుతీ ప్రసాద్, పెంద్ర అప్పన, బి.రాధ, దేవరకొండ మార్కేండేయులు, బి.పద్మావతి, పి.సునీత,జె.అప్పల రాజు, పల్లా దుర్గ, బొండా శ్రీనివాస్, పత్తివాడ కనకరాజు , సన్యాసిరావు, రోజారాణి, భాను, సత్యాల సాగరిక, మల్లేశ్వరి, శిరీష తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో నృత్యం చేస్తున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మహిళా ప్రతినిధులు

బస్సు నుంచి కింద పడి విద్యార్థి దుర్మరణం


రోదిస్తున్న కుటుంబ సభ్యులు (అంతర చిత్రం) మృతి చెందిన భరణి

పద్మనాభం: పండగ సమీపిస్తున్న వేళ.. ఓ విద్యార్థిని మృత్యువు కబళించింది. ఈ ప్రమాదంలో ఆ ఇంట్లో విషాదం నెలకొంది. ఈ ఘటనకు సంబంధించి సీఐ శ్రీధర్ అందించిన వివరాలివీ.. ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ గొల్లలపాలెం గ్రామానికి చెందిన కోండ్రు భరణి(17) తగరపువలస భాసర కళాశాలలో ద్వితీయ ఇంటర్ ఎంపీసీ చదువుతోంది. శనివారం ఉదయం గొల్లలపాలెంలో బస్సు ఎక్కి కళాశాలకు వెళ్తోంది. మార్గమధ్యలో పద్మనాభం మండలం ఏనుగులపాలెం సమీపంలో మలుపు ఉండడంతో డ్రైవర్ ఆకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో ఆమె అదుపు తప్పి రోడ్డుపై పడిపోయింది. ఈ ఘటనలో భరణి తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే ఆమెను మారికవలసలోని గాయత్రి ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటనపై భరణి తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. గొల్లలపాలేనికి చెందిన అప్పారావు, నరసమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె జ్ఞానేశ్వరి డిగ్రీ చదువుతోంది. రెండో కుమార్తె భరణి ఇంటర్, కుమారుడు 10వ తరగతి చదువుతున్నారు. తండ్రి అప్పారావు ఆటో నడుపుతూ వచ్చిన ఆదాయంతో ముగ్గురు పిల్లలను చదివిస్తున్నాడు. భరణి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. వీరిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు.

రూ. 50 కోట్లు విలువచేసే అప్పన్న భూమి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న భూమి వద్ద ఆర్డర్ కాపీని చూపిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేపగుంట సర్వే నంబర్ 181 బాలాజీనగర్‌లోని రూ50 కోట్ల విలువ చేసే 3.40 ఎకరాల భూమిని శనివారం దేవస్థానం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దేవస్థానం ఈవో వి. త్రినాథరావు ఆధ్వర్యంలో భూపరిరక్షణ విభాగం అధికారులు సంబంధిత స్థలానికి వెళ్లి ఆ స్థలం చుట్టూ దేవస్థానం గార్డుతో ఫెన్సింగ్ వేయించారు. దేవస్థానం ఈవో త్రినాథరావు మాట్లాడుతూ సర్వే నంబర్ 181లో దేవస్థానానికి చెందిన భూమి 3.40 ఎకరాలు ఉందని, ఆ భూమిని చల్లా వసంతతోపాటు కొంతమంది ఆక్రమించుకోవడంతో 2010 నుంచి వివాదం నడుస్తోందన్నారు. చల్లా వసంతతో పాటు కొంతమంది రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటీషన్ వేయగా కోర్టు దేవదాయ చట్టం సెక్షన్ 83 ప్రకారం తొలగించేందుకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీంతో చల్లా వసంతకు దేవస్థానం నోటీసులు జారీ చేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి సంబంధిత స్థలాన్ని దేవస్థానం స్వాధీనం చేసుకుందని తెలిపారు. సంబంధిత స్థలంలో ఎలాంటి ఆక్రమణలకు తావులేదని, ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవస్థానం లీగల్ సెల్ అడ్వకేట్ ఎన్‌వీఎస్ ప్రసాద్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఇన్‌చార్జి డీఈ హరి, లీగల్ సెక్షన్ ఏఈవో వీబీవీ రమణమూర్తి, భూపరిరక్షణ విభాగం సూపరింటెండెంట్ వెంకటరమణ సమక్షంలో భూమిని స్వాధీనం చేసుకున్నారు.

ఒప్పో రెనో 13 సిరీస్ ఫోన్ల విడుదల


ఒప్పో రెనో సిరీస్‌ను లాంచ్ చేస్తున్న డింపుల్ హయాతి, సెల్‌పాయింట్ చైర్మన్ మోహన్ ప్రసాద్ పాండే

డాబాగార్డెన్స్: సెల్ పాయింట్ ఇండియా ఒప్పో రెనో 13 సిరీస్‌ను శనివారం లాంచ్ చేసింది. డాబాగార్డెన్స్‌లోని సెల్‌పాయింట్ షోరూంలో సెల్‌పాయింట్ ఇండియా చైర్మన్ మోహన్ ప్రసాద్ పాండే నేతృత్వంలో సినీనటి డింపుల్ హయాతి ఒప్పో రెనో 13 సిరీస్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్‌పాయింట్‌లో ఒప్పో రెనో 13 సిరీస్ లాంచ్ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఏ కంపెనీ అయినా అప్‌డేటెడ్ మొబైల్ మార్కెట్‌లోకి అందుబాటులోకి తెచ్చిందంటే.. అది ముందుగా సెల్‌పాయింట్‌లో ఆవిష్కరణ అవుతుందన్నారు. విశాఖపట్నంలో సెల్‌ఫోన్లకు సంబంధించి సెల్‌పాయింట్ అడ్డాగా మారిందన్నారు. మంచి ఫీచర్స్‌తో ఒప్పో రెనో 13 సిరీస్ మార్కెట్లో అందుబాటులో ఉందన్నారు. మోహన్‌ప్రసాద్ పాండే మాట్లాడుతూ విశాఖపట్నంలో తొలిసారిగా డైమండ్ పార్క్ వద్ద సెల్‌పాయింట్‌ను ప్రారంభించామన్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ విశాఖలో 29, రాష్ట్ర వ్యాప్తంగా 82 సెల్‌పాయింట్ స్టోర్లకు విస్తరించినట్లు వివరించారు. 25 ఏళ్లుగా నాణ్యత గల ఉత్పత్తులు, వినియోగదారుల సేవలందించడంలో సెల్‌పాయింట్ విశ్వసనీయతగా నిలిచిందన్నారు. నూతన ఒప్పో రెనో 13 సిరీస్ కొనుగోలుపై లక్కీ డిప్ ద్వారా బైక్‌తో పాటు పలు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సెల్‌పాయింట్ ప్రతినిధి బాలాజీ పాండే, పోతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ వసూలు చేస్తే చర్యలు

విశాఖ సిటీ: కైలాసగిరిపై నిర్దేశిత ధరల కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తప్పవని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ హెచ్చరించారు. కైలాసగిరిపై బ్యాటరీ కార్లకు నిర్ణీత రుసుము కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారని 'సాక్షి' ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం చైర్‌పర్సన్‌తో పాటు జాయింట్ కమిషనర్ కె.రమేష్, ఇతర అధికారులు కైలాసగిరిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

కొక్కొరోకో.. బరిలో కాసుకో

పందెం కోళ్లు C/O భీమవరం బ్రీడ్


రూ.4 లక్షల విలువ చేసే పెరూ కాక్


రెండు పందాలు గెలిచిన రూ.లక్ష విలువ చేసే కాకి డేగ
ఒక పందెం గెలిచిన రూ.లక్ష విలువ చేసే కాకి డేగ
15 నెలల వయసు గల రూ.55 వేల విలువ చేసే పచ్చ కాకి
రూ.30 వేల విలువ చేసే పెరూ క్రాస్
రూ.50 వేల విలువ చేసే మూడున్నరేళ్ల కాకి పర్ల
రూ.30 వేల విలువ చేసే కక్కెర
రూ.35 వేల విలువ చేసే పూల
రూ.లక్ష విలువ చేసే డేగ

తగరపువలస: తీక్షణమైన కళ్లు, మనుష్యులలో ఉండే పగ, శత్రువుపై విరుచుకు పడటం, పోరాడేతత్వం, నిత్యం అప్రమత్తం పందెం కోళ్ల సొంతం. ఉత్తరాంధ్ర మకాంలో తిష్టవేసిన వీటిలో చాలా వరకు తెలంగాణ, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందినవే కావడం గమనార్హం. ఆయా ప్రాంతాల్లో పందేలు గెలిచిన వాటికి ఇక్కడ మకాంల్లో గౌరవం దక్కుతుంది. వీటిని బ్రీడ్ కోసం మకాం యజమానులు వినియోగిస్తుంటారు. పందేల కోసం ఉపయోగించరు. భీమిలి పరిధిలో బ్రీడ్ కోసం వినియోగించే ఒక్కొక్క కోడి ధర రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు పలుకుతోంది. ప్రస్తుతం భీమిలితో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పందేల కోసం గుట్టుగా పెంచుతున్న కోళ్లలో కాకిడేగ, డేగ, కాకి పర్ల, పచ్చకాకి, పెరూ క్రాస్, పెరూ కాక్, తెల్ల సవల, నల్ల సవల, సేతువ, కక్కెర, పూల వంటి జాతులు ఉన్నాయి. వీటి విలువ రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు ఉంటాయి. ఒక్కో మకాంలో వీటి సంఖ్య 100 నుంచి 150 వరకు ఉన్నాయి. ఈ ప్రాంతంలో పందేల కోసం వినియోగించిన కోళ్లలో ఎక్కువ శాతం భీమవరం బ్రీడేనని పెంపకందారులు అంటున్నారు.


మేత కోసం నానబెట్టిన వడ్లు, రాగులు, చోళ్లు

పౌష్టికాహారంలో తగ్గేదెలే..

పందెం కోళ్ల పెంపకందారులు కన్నబిడ్డల కంటే వీటికే అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఏడాది పొడవునా ధాన్యం, రాగులు, సజ్జలు ఆహారంగా ఇచ్చినా నవంబరు, డిసెంబర్ మాసాలలో ప్రత్యేక ఆహారం ఇస్తారు. బాదం, నువ్వులు, బెల్లం, వాల్‌నట్‌లు, పటిక, పుచ్చగింజలు, కిస్‌మిస్, ఖర్జూరం తదితర డ్రైఫ్రూట్స్ ఉదయం వేళ 30 గ్రాములు అందిస్తారు. ఇవి కాకుండా కోడిగుడ్లు, కైమా ప్రత్యేకం. ఇంకా బలానికి ఖరీదైన మల్టీ విటమిన్లు, లవీటోన్-హెచ్, ఎం-సెఫ్ట్, ఆర్‌డి, లసోచ్, క్లోన్-30 వంటి టానిక్‌లతో పాటు హోమియో మందులు కూడా వినియోగిస్తారు.

ఉపాధిగా మలచుకున్నాను



డిగ్రీ చదువుకున్న నేను చిట్టివలస జ్యూట్‌మిల్లులో కార్మికునిగా పనిచేశా. మిల్లు మూతపడిన తరువాత పందెంకోళ్ల పెంపకాన్ని వ్యాపకంగా పెట్టుకున్నా. ఏటా కోళ్ల దాణా, మందుల కోసం రూ.3 లక్షలు ఖర్చు చేస్తా. 365 రోజులు వీటి ధ్యాసే. దాణాకు సోనామసూరి, స్వర్ణ మసూరి ధాన్యాన్నే వినియోగిస్తాను. 100 కోళ్లకు ఏటా 10 టన్నుల ధాన్యం, టన్ను వంతున రాగులు, సజ్జలు కొంటాను. వీటికి మేతతో పాటు ఈత తప్పనిసరి. వ్యాధులు వస్తే ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను సంప్రదించి వారు చెప్పిన దానికంటే తక్కువ మోతాదు మందులు వేస్తాను. చుట్టుపక్కల గ్రామాలలో ఏ మకాం వాళ్లయినా కోళ్లకు సమస్య వస్తే నా సలహాలు పాటిస్తారు. కుటుంబ పోషణకు ఈ ఉపాధి సరిపోతుంది. ఈ ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో వర్షం కారణంగా పందెం కోళ్ల అమ్మకాలు మందగించాయి.

–చిల్ల అప్పలరెడ్డి, చిల్లపేట

విశాఖ ఉక్కుపై కూటమి కుట్ర

స్టీల్ ప్లాంట్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ లకే రాజారావు


సంఘీభావం తెలుపుతున్న జేఏసీ నాయకులు

సీతంపేట: 'విశాఖ ఉక్కును నిర్వీర్యం చేయాలనే కుట్ర కేంద్రానికి ఉన్నట్టుంది..అందుకే విశాఖ వచ్చిన ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంట్ కోసం ఒక్కమాట మాట్లాడలేదు' అని విశాఖ స్టీల్ ప్లాంట్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ లకే రాజారావు ఆరోపించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా స్టీల్‌ప్లాంట్ విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకువెళ్లకపోవడం ఉత్తరాంధ్ర ప్రజలను విస్మయానికి గురి చేసిందన్నారు. నక్కపల్లిలో పెట్టబోతున్న ప్రైవేట్ రంగంలోని స్టీల్ ప్లాంట్‌కు హైటెక్ పద్ధతుల్లో ఇనుప ఖనిజాన్ని సరఫరా చేస్తామని సభలో ప్రకటించిన చంద్రబాబు.. విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడకపోవడం కేంద్రం కుట్రలో భాగమేనన్నారు. అమరావతి రైతులకిచ్చిన ప్రాధాన్యత విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఇవ్వక పోవడం దేనికి నిదర్శనమో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.శివప్రసాద్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు పూర్తి వ్యతిరేకమని ప్రగల్భాలు పలికిన పవన్ కల్యాణ్ ఇప్పుడెందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. జేఏసీ బీసీ సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ కట్టా మల్లేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, రచయిత తెన్నేటి జయరాజ్, ఆదివాసి వికాస్ పరిషత్ ప్రతినిధి రామారావు దొర, మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు బాగం గోపాలరావు, కనికెళ్ల వరలక్ష్మి, ఎం.అన్వేష్ తదితరులు సంఘీభావం తెలిపారు.

యువతి ప్రాణాలను కాపాడిన ఆర్పీఎఫ్ సిబ్బంది

గోపాలపట్నం: రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించిన యువతిని రైల్వే పోలీసులు కాపాడారు. మర్రిపాలెం ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాలు..శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మర్రిపాలెం–గోపాలపట్నం రైల్వే ట్రాక్‌పై యువతి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. ఈ విషయం గమనించిన స్థానికులు వెంటనే ఆర్పీఎఫ్ సిబ్బందికి సమాచారం అందించడంతో విధి నిర్వహణలో ఉన్న ఎస్ఐ ఎం.నాయక్, కానిస్టేబుల్ మూర్తితో కలిసి ట్రాక్‌పై వెళ్తున్న ఆమెను రక్షించారు. వివరాలు ఆరా తీయగా.. కొబ్బరి తోటకు చెందిన యువతి అని..స్నేహితుడితో వచ్చిన సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకోవాలనుకుందని తెలిపారు. యువతికి కౌన్సెలింగ్ ఇచ్చి అనంతరం ఆమె బంధువులకు అప్పగించారు.

శ్రోతలను మైమరపించిన సంగీత కచేరీ


కచేరీ నిర్వహిస్తున్న సిద్ శ్రీరామ్

బీచ్‌రోడ్డు: విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శనివారం జరిగిన సిద్ శ్రీరామ్ గాత్ర సంగీత కచేరీ అలరించింది. తోడి రాగ వర్ణంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో సిద్ శ్రీరామ్ నాసిక భూషణ రాగంలో 'మారవైరి రమణ', బహుదారి రాగంలో 'బ్రోవభారమా', పంతువరాళి రాగంలో 'శంకరి నిన్నే'కీర్తనలను చక్కని రాగాలాపనతో, శ్రావ్యమైన స్వరకల్పనతో గానం చేసి ప్రేక్షకులను మైమరపింపజేశారు. నళినకాంతి రాగంలో 'మనవి యాలకించ', ఆభేరి రాగంలో 'నగుమోము', భవప్రియ రాగంలో 'శ్రీకాంత నీయెడ'కీర్తనలు గాయకుడి సంగీత పరిజ్ఞానానికి నిదర్శనంగా నిలిచాయి. సంగీత కచేరీకి హెచ్.ఎన్. భాస్కర్ వయోలిన్, డాక్టర్ పత్రి సతీష్ కుమార్ మృదంగం, అనిరుధ్ ఆత్రేయ కంజీరా వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా నవయుగ సంస్థ చైర్మన్ సి.వి.రావు కళాకారులను సత్కరించారు.

పోలీస్ పరీక్షలకు నాలుగు రోజులు బ్రేక్

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో కానిస్టేబుళ్ల నియామక పరీక్షలకు నాలుగు రోజులు విరామం ప్రకటించారు. సంక్రాంతి సందర్భంగా ఆదివారం నుంచి 15వ తేదీ వరకు సెలవు ప్రకటించినట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. తిరిగి ఈనెల 16న యథావిధిగా శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. శనివారం జరిగిన పరీక్షలకు 600 మందికి 319 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. వారిలో 235 మంది అభ్యర్థులు తదుపరి పరీక్షలకు అర్హత సాధించారన్నారు.

నేడు సికింద్రాబాద్‌కు స్పెషల్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆదివారం సికింద్రాబాద్(చర్లపల్లి స్టేషన్)కు ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం–చర్లపల్లి (07246) స్పెషల్ రైలు 12వ తేదీన ఉదయం 8 గంటలకు విశాఖలో బయల్దేరి రాత్రి 9.20 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు జంక్షన్, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, మధిర, ఖమ్మం, డోర్నకల్ జంక్షన్, మహబూబాబాద్, వరంగల్, కాజీపేట, జనగాం స్టేషన్‌లలో ఆగుతుంది.